క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 24న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. రామన్నపేట, బీట్ బజార్, హంటర్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8.30గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. భీమారంలోని రాధిక ఆస్పత్రి, రామాలయం, సదానంద కాలనీ, అంబా కాంప్లెక్, దుర్గాకాలనీ, సంతోషిమాత ఆలయ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6.30గంటల వరకు భీమారం చర్చి, గ్రామపంచాయతీ, మసీదు, బొడ్రాయి, సత్యసాయికాలనీ, రుద్రమ్మదేవీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని తెలిపారు.

రేపు శ్వేతార్కుడికి తేనెతో అభిషేకం

కాజీపేట: కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో మంగళవారం సంకటహర చతుర్థి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఆలయానికి అప్పగించే 108 లీటర్ల తేనెతో స్వామివారికి అభిషేకం చేయనున్నట్లు వివరించారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



హన్మకొండ కల్చరల్: హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 36వ బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ అర్చకుడు అనంత శేషరాజన్ ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు స్వస్తివాచనం, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధం, రుత్విక్‌కరణం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, తదితర పూజలు చేశారు.

ఘనంగా బొడ్రాయి ఉత్సవాలు



కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి గ్రామంలో ఆదివారం బొడ్రాయి 10వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి దేవతామూర్తులకు నైవేద్యం సమర్పించారు. కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీతో కలిసి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎండీ.అంకూస్, ఇప్ప శ్రీకాంత్, సుంచు అశోక్, గుంటి కుమారస్వామి, పి.ఆంజనేయులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల పట్టివేత

రామన్నపేట : ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వరంగల్ పోస్టాఫీస్ వద్ద ఆదివారం వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఓ ఆటోలో నిషేధిత పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు. వరంగల్‌కు చెందిన రాజ్‌కుమార్, గౌరీశంకర్, ఆటో డ్రైవర్ సురేశ్.. కొన్ని సంవత్సరాల నుంచి బీట్ బజార్‌లోని వంశీ అనే వ్యాపారి వద్ద తక్కువ ధరకు పొగాకు ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నారు. అనంతరం ఆటోలో తిరుగుతూ ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో బీట్‌బజార్‌లో మరోసారి పొగాకు ఉత్పత్తులు కొనుగోలు చేశారు. ఆ ఉత్పత్తులు కరీంనగర్‌కు ఆర్టీసీ కార్గో ద్వారా తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో నిందితుల వద్ద నుంచి రూ. 1.20 లక్షల విలువైన నిషేధిత పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఆగస్టు 26న శివశక్తి వినాయక ప్రతిష్ఠాపన



ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్ రోడ్డు పెట్రోల్ బంక్ జంక్షన్‌లోని శివశక్తి వినాయక మందిరం ప్రాంగణంలో ఉత్సవ కమిటీ ప్రతినిధి చెన్నూరి దేవేందర్, నల్లకుంట రవికుమార్, అచ్చ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో 38వ డివిజన్ కార్పొరేటర్ బైరబోయిన ఉమ నేతృత్వంలో ఆగస్టు 26నుంచి 28వ తేదీ వరకు శ్రీగణపతి శివలింగ, నందీశ్వర సహిత పార్వతీదేవి విగ్రహాల పునఃప్రతిష్ఠాపన జరగనుందని నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు సంబంధిత కరపత్రాలను ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆదివారం ఆవిష్కరించారు. అలాగే, వై ఆకారం జంక్షన్ హిందూ గద్దె స్థానంలో 15అడుగుల ఎత్తైన వీరాంజనేయ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హసన్‌పర్తి జిల్లా పరిషత్ పాఠశాల 1980 - 81వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు



హసన్‌పర్తి జిల్లా పరిషత్ పాఠశాల 1990-91వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాల పదవ తరగతి పూర్వ విద్యార్థుల (1980 - 81) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు ఒకచోట చేరి గత స్మృతులను గుర్తుచేశారు. నాటి గురువులను సన్మానించారు. ప్రతీఏడాది సమ్మేళనం నిర్వహించుకోవాలని నిర్ణయించారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు మాటేటి రవీందర్, కేదాసి వెంకటేశ్వర్లు, పిట్టల కుమారస్వామి, తాళ్ల విద్యాసాగర్, ఇందిర, కృష్ణవేణి, దోమల రవీందర్, మారపల్లి రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

34 ఏళ్ల తర్వాత..

హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి పూర్వ విద్యార్థుల (1990 -91) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 34ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులందరు కలిసి పాత జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. వచ్చే ఏడాది భారీ స్థాయిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని తీర్మానించారు. పూర్వ విద్యార్థులు సంజీవ్, బల్సుకూరి శ్రీనివాస్, కొత్తకొండ సుభాష్, చిర్ర తిరుపతి, కట్కూరి రాజిరెడ్డి, నేదునూరి కుమారస్వామి, బోడ యుగంధర్, నంది శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఖిలా వరంగల్: ఆత్మీయ సమ్మేళనంలో శ్రీవెంకటేశ్వర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

శ్రీవెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో..

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్ గుట్ట సమీపంలోని నాని గార్డెన్స్‌లో ఉర్సు శ్రీవెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో 1984 – 85వ బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థులందరు ఒక చోట చేరి నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బలభద్ర అశోక్‌కుమార్, కోడం శ్రీధర్, పిన్న రాజు, దేవసాని శ్రీరామ్మూర్తి, గుట్టు రమణ తదితరులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాస్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట: పెరిగిన ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్‌రావు విమర్శించారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా సమితి సమావేశం ఎల్లేశ్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న జిల్లా వ్యాప్తంగా ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. పెరిగిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు సామాన్యులకు మోయలేని భారంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. టమాటా, ఉల్లి తదితర నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటాయని వాపోయారు. సమావేశంలో నాయకులు భిక్షపతి, శ్రీనివాస్, రాములు, ఓదెలు, సంతోష్, సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య మహాసభ జాతీయ సంయుక్త కార్యదర్శిగా రమేష్



హసన్‌పర్తి: అఖిల భారత పారంపర్య వైద్య మహా సంఘం జాతీయ సంయుక్త కార్యదర్శిగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన చింతగట్టు గోశాల వ్యవస్థాపక అధ్యక్షుడు సర్జన రమేష్ ఎన్నికయ్యారు. ఏపీలోని తిరుపతిలో ఈ ఎన్నికలు జరిగాయి. దేశవ్యాప్తంగా గ్రామస్థాయిలోని సాంప్రదాయ వైద్యులను గుర్తించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వారికి గుర్తింపు పత్రం ఇప్పించే దిశగా ఈ సంఘం కృషి చేస్తోందని రమేష్ తెలిపారు.

వెంకటాద్రినగర్ అభివృద్ధి కమిటీ ఎన్నిక



కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ వెంకటాద్రినగర్ కాలనీ అభివృద్ధి కమిటీని కాలనీవాసులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కార్పొరేటర్ ఎలకంటి రాములు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడిగా షఫిక్, జాయింట్ అధ్యక్షుడిగా రాంనారాయణ సింగ్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.రఫీ, సంయుక్త కార్యదర్శిగా ఎండీ.హలీం, కోశాధికారిగా కరుణాకర్ రెడ్డి ఎన్నికయ్యారు.

ప్రజా సమస్యలను వెలికితీయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంచంద్రం

కేయూ క్యాంపస్: జర్నలిజం విద్యార్థులు మీడియా యూనిట్‌తోపాటు స్పోకెన్ ఇంగ్లిష్ ల్యాబ్‌ను, అలాగే దూరవిద్యా కేంద్రంలోని లైబ్రరీని వినియోగించుకోవాలని కేయూ ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ రాంచంద్రం సూచించారు. కేయూలోని దూరవిద్యా కేంద్రంలో రెగ్యులర్ జర్నలిజం విభాగం (2022 -2024) విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను జర్నలిస్టులు వెలికి తీయాలని సూచించారు. జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్ సంగాని మల్లేశ్వర్ మాట్లాడుతూ జర్నలిజం విద్యార్థులకు సమాజంపట్ల నిశిత దృష్టి ఉంటుందన్నారు. ఇంగ్లిష్ కమ్యూనికేషన్ గల జర్నలిజం విద్యార్థులకు మీడియా సంస్థల్లో అనేక ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. సమావేశంలో జర్నలిజం విభాగం అధ్యాపకులు నర్సింహారాములు, డాక్టర్ శ్రీకాంత్‌యాదవ్, డాక్టర్ వంగాల సుధాకర్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, మోటె చిరంజీవి, విద్యార్థి సంఘాల నాయకులు సురేష్, మానస, శివకృష్ణ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

'జయశంకర్ విగ్రహాన్ని విస్మరించిన కాంగ్రెస్'



విగ్రహానికి రంగులద్దుతున్న బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు

హన్మకొండ: తెలంగాణ సిద్ధాంతకర్త, స్వరాష్ట్ర సాధన ఉద్యమానికి దిక్సూచి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ నిర్వహణ, బాగోగులను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు నయీముద్దీన్ ఆరోపించారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు (ప్రొఫెసర్ జయశంకర్ స్మృతివనం)లోని జయశంకర్ విగ్రహానికి రంగు వెలిసి చూడడానికి అంధవికారంగా మారిపోయిందని అన్నారు. ఈక్రమంలో ఆదివారం రంగులద్దినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు స్వరాష్ట్ర సాధన ఉద్యమ మహనీయులను మరిచారని విమర్శించారు. ఉద్యమ శక్తులకు సముచిత గౌరవం కల్పించాలని, వారి చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు యాకుబ్, ఇస్మాయిల్, మసూద్, రఫీ, గౌస్‌ఖాన్ పాల్గొన్నారు.

జర్నలిస్టు నాయకులకు ఘన సన్మానం



ఉబేద్‌బాబాను సన్మానిస్తున్న జర్నలిస్టులు

వరంగల్: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) తెలంగాణ రాష్ట్ర కమిటీలో ఉపాధ్యక్షుడిగా గాడిపెల్లి మధు, ఈసీ మెంబర్లుగా పెండెం వేణుమాధవ్, కంకణాల సంతోష్ చోటు సంపాదించారు. ఈమేరకు వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని ఉబేద్‌బాబా ఇంటి ప్రాంగణంలో ఓ ఉర్దూ ప్రతిక సీనియర్ జర్నలిస్టు ఇస్మాయిల్ జబీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వారిని సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఉర్సు దర్గా పీఠాధిపతి ఉబేద్‌బాబా హాజరై గాడిపెల్లి మధు, వేణుమాధవ్, సంతోష్, వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య అభినందించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఈసీ మెంబర్ సంగోజు రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్, పెరుమాండ్ల మధు, సాజిద్, ఎండీ.అమీర్, హుస్సేన్ పాషా, అమీర్, అక్రం, కలికోట శ్రీధర్, నయీం పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై నాయకుల హర్షం



రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు

కాజీపేట రూరల్: రూ.2 లక్షల రైతు రుణమాఫీపై కాంగ్రెస్ నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చిత్రపటాలకు రైతులు, కాంగ్రెస్ నాయకులు కాజీపేట 47వ డివిజన్ బోడగుట్టలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ మాజీ అధ్యక్షుడు దొంగల కుమార్‌యాదవ్ తెలంగాణ రైతాంగానికి ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో రైతులు జి.సదానందం, ఎడ్ల ఎల్లస్వామి, బొల్లం రాజు, మొగిలి, నాయకులు ఇప్ప శ్రీకాంత్, షేక్ అజ్గర్, మైసారపు సిరిల్‌లారెన్స్, మహ్మద్ బిలాల్, కొమురవెల్లి రమేష్, భూషపాక శ్రీనివాస్, మహ్మద్ అలీమ్, బండారి రాజేందర్ పాల్గొన్నారు.

రుణమాఫీ నిర్ణయం చరిత్రాత్మకం



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

హన్మకొండ చౌరస్తా: ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ నిర్ణయం చరిత్రాత్మకమని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయల రైతు రుణాన్ని ఆరు విడతలుగా మాఫీ చేయగా, పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.11.930 వేల కోట్లు మాఫీ చేసి రైతులను మోసం చేసిందని ఆరోపించారు. రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న మాజీ మంత్రి హరీశ్‌రావు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు స్వర్ణ, టీపీసీసీ కార్యదర్శి ఈవీ.శ్రీనివాసరావు, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు పోతుల శ్రీమన్నారాయణ, విజయశ్రీరజాలీ, నాయకులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు అండగా ఉంటా

ఆటో కార్మికులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ పోలీస్ కమిషనరేట్ వద్ద గల కాకతీయ ఆటో యూనియన్ అడ్డా వద్ద బోర్డును ఎమ్మెల్యే ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. నగరంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో ఆటోడ్రైవర్ల సేవలు కీలకమని ప్రశంసించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, కాకతీయ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎండీ.అంకుషావలి, ఉపాధ్యక్షుడు ఎండీ.యాసిన్, ప్రధాన కార్యదర్శి ఎండీ.అక్రమ్, కార్యదర్శి మీర్జా, కోశాధికారి ఇక్బాల్, సహాయ కార్యదర్శి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేకల రవి

వరంగల్ /ఖిలా వరంగల్: సింగరేణి బొగ్గు గనుల వేలంపాటలను వెంటనే నిలిపివేయాలని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. వరంగల్‌లోని పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి బుస్సా రవీందర్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కార్మిక పోరాటలతోనే బుద్ధి చెప్పాలని సూచించారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను యావత్ కార్మికలోకం అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సింగరేణి బొగ్గు బ్లాకుల వేలాన్ని తక్షణమే ప్రభుత్వరంగ సంస్థలకు అప్పగించాలని సూచించారు. జిల్లాలో నూతన పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే.బష్మీర్, నాయకులు గుండె బద్రి, సంద్ర కుమార్, మెడిది అశోక్, పరికిరాల రమేష్, లావుడ్యా దసురు, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి వలబోజు వెంకన్న, మల్లారెడ్డి, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

వేగంగా సుందరీకరణ పనులు



కాజీపేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన విగ్రహాలు



కాజీపేట: కాజీపేట చౌరస్తా సుందరీకరణ పనులు వేగంగా సాగుతున్నాయి. వరంగల్ నగరానికి ముఖద్వారంగా ఉండే కాజీపేట చౌరస్తా ప్రధాన రహదారిని అభివృద్ధి చేయడానికి కుడా, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా కృషి చేస్తున్నారు. ప్రధాన రహదారిపై ఒక పక్కన ఒక డిజైన్‌ను నిర్మించి దానిలో పర్యాటకులతో పాటు బాటసారులను ఆకర్షించేలా విగ్రహాలను ఏర్పాటు చేశారు. మిగిలిపోయిన చిన్నచిన్న పనులను పూర్తిచేసి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలో ప్రారంభించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పాక్షికంగా కాకుండా పూర్తి స్థాయిలో ఏకకాలంలో అభివృద్ధి పనులు చేపట్టాలని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు.

శ్యామ్‌ప్రసాద్ జీవితం స్ఫూర్తిదాయకం



రంగశాయిపేటలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



కాశిబుగ్గ: ఓసిటీలో..



మడికొండ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: రాజనీతిజ్ఞుడు, దేశ ఐక్యత, సమగ్రతను కాపాడే దిశగా పోరాడిన డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని బీజేపీ నేత కొల్లూరు యోగానంద్ కొనియాడారు. ముఖర్జీ 53వ వర్ధంతి సందర్భంగా వరంగల్ 42వ డివిజన్ రంగశాయిపేటలోని నెహ్రూ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆదివారం నివాళులర్పించారు. ఏక్ దేశ్ మే దో నిషాన్, దో విధాన్, దో ప్రధాన్ నహీ చలేగా అంటూ నినదించి కశ్మీర్.. భారత్‌లో అంతర్భాగమని శ్యామ్‌ప్రసాద్ చెప్పారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మోహనాచారి, దీన్‌దయాళ్, పరమేశ్వర్, పోలెపాక జనార్దన్, మంద బాబురావు, కంచ సాంబయ్య, చిన్నారావు, మణిదీప్, శ్రీను, అశోక్, శ్యామ్, శివ, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జన సంఘ్ వ్యవస్థాపకుడికి నివాళి

మడికొండ: జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకు మడికొండ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకుడు పొనగోటి వెంకట్‌రావు మాట్లాడుతూ ఒకే దేశం, ఒకే రాజ్యాంగం ఉండాలని, భారతీయత ఆధారంగా 1951, అక్టోబర్ 21న భారతీయ జన సంఘ్‌ను స్థాపించి, అఖండ భారతవని కోసం 1953, జూన్ 23వ తేదీన కశ్మీర్‌లో అసువులు బాసిన భరత మాత ముద్దుబిడ్డ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. ఆర్టికల్ 370 రద్దు చేసి శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ కలను నెరవేర్చిన ప్రధాని నరేంద్ర మోదీ అని అన్నారు. కార్యక్రమంలో దళితమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, కందుకూరి బాలరాజు, కేతిక సదానందం, బొల్లికొండ వినోద్, బైరపాక వెంకటేష్, కొలిపాక కుమార్‌బాబు, గడ్డం కుమార్, మాచర్ల రంజిత్, రాజేందర్, కృష్ణ, రమేష్, అరవింద్ కుమార్, అన్వేష్, నాగార్జున, పినోకర్, రాకేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వరంగల్: పోచమ్మమైదాన్ జంక్షన్‌లో కాగడాల ప్రదర్శన చేస్తున్న బీజేవైఎం నాయకులు

దేశ సమైక్యతకు ప్రాణాలర్పించిన మహానేత

కాశిబుగ్గ: దేశ సమైక్యతకు ప్రాణాలర్పించిన మహానేత శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు కొనియాడారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని ఓసిటీలోని ప్రదీప్‌రావు క్యాంపు కార్యాలయంలో ఆదివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాగడాల ప్రదర్శన

వరంగల్: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి 'బలిదాన్ దివస్' సందర్భంగా వరంగల్ జిల్లా బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పోచమ్మమైదాన్ జంక్షన్‌లో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి నాయకులు సముద్రాల పరమేశ్వర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం సతీష్ షా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్, బీజేవైఎం నాయకులు వినయ్, చారి, సాయి, చంద్రమోహన్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేదజ్యోతిష్య సమ్మేళనానికి హాజరు



హన్మకొండ కల్చరల్: ఇంటర్నేషనల్ వేదిక్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ వేద జ్యోతిష్య సమ్మేళనంలో వరంగల్ జిల్లా ఓసిటీ ప్రాంతానికి చెందిన వాస్తు జ్యోతిష్య పండితుడు శ్రీరామోజు వీరబ్రహ్మాచార్యులు పాల్గొన్నారు. న్యూఢిల్లీలో ఇంటర్నేషనల్ హోటల్ రాడిసన్ బ్లూలో యూఎస్, ఇండియా చాప్టర్లు సంయుక్తంగా అంతర్జాతీయ వేదజ్యోతిష్య సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించాయి. దేశ, విదేశాల నుంచే పలువురు హాజరైన సదస్సులో తెలంగాణ ప్రాంతం నుంచి ఐదుగురు వాస్తుజ్యోతిష్య పండితులు హాజరయ్యారు.